సాక్షి తిరుపతి

గురువారం । 28 । నవంబర్ । 2024



ఇసుకింకరులకు నోట్లు

అక్రమార్కులు స్వర్ణముఖ నదిలో ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఆ సైకతాన్ని తరలించి, ధనార్జన చేస్తున్నారు. - 8లో



వచ్చేనెలాఖరులోపు ఓటర్ల జాబితా

డిసెంబర్ నెలాఖరు లోపు ప్రత్యేక ఓటర్ల జాబితా పూర్తి చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ వి. వినయ్ చంద్ తెలిపారు. - 8లో



బాల్యవివాహ వ్యవస్థ నిర్మూలిద్దాం

సమష్టిగా పనిచేసి, బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దామని ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

పన్ను చెల్లించని వాహనాలు సీజ్



ప్రైవేట్ ట్రావెల్ బస్సును సీజ్ చేస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్

తిరుపతి మంగళం: సకాలంలో త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ప్రైవేట్ ట్రావెల్ యజమానులు వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖాధికారి(డీటీఓ) కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. బుధవారం తిరుపతి–కరకంబాడి మార్గంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలో హైదరాబాద్ నుంచి తిరుపతికి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆయన ఆపి తనిఖీ చేశారు. సంబంధిత వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నేషనల్ పర్మిట్ ఆథరైజేషన్, త్రైమాసిక పన్నులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడంతో ఆ బస్సును సీజ్ చేసి, మంగళం ఆర్టీసీ డిపో వద్ద ఉంచారు. అయితే ప్రైవేట్ ట్రావెల్ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు లేకపోవడంపై అధికారులు విస్మయం చెందారు. కాంట్రాక్ట్ క్యారేజీ వాహనాల యజమానులు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించి వాహనాన్ని ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగించాలని, వాహనాలను సరైన కండిషన్‌లో ఉంచుకోవాలని, డ్రైవర్లను ప్రయాణానికి ముందే బ్రీత్ అనలైజర్ ద్వారా మద్యం సేవించి ఉన్నాడా? లేదా అని పరీక్షించాలని సూచించారు. ఈ నెలలో జిల్లాలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.1.80 కోట్లు జరిమానాలు, పన్నులు వసూలు చేశామన్నారు.

30న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30, ఒకటో తేదీల్లో ఉదయం 8 గంటలకు గుంటూరు జిలా మందడ గ్రామంలోని గుడ్ రోల్ పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత సైకిల్, సామగ్రితో హాజరుకావాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు డిసెంబరు 7నుంచి ఒడిశా రాష్ట్రం, పూరీలో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) నిర్వహించే జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు డీఎస్ఏ సైక్లింగ్ కోచ్ వి.కనకరావును 98493 79932, డీఎస్ఏ అథ్లెటిక్ కోచ్ ఎస్.శివారెడ్డిని 97030 92077ను సంప్రదించాలన్నారు.

టమాట తారెత్తిస్తోంది.. క్యారెట్ కయ్‌మంటోంది.. ఉల్లి ఉసూరుమనిపిస్తోంది.. బెండ బెంబేలెత్తిస్తోంది.. పచ్చిమిర్చి ఘాటెక్కిస్తోంది.. వంకాయ వణికిస్తోంది.. దొండ దడ పుట్టిస్తోంది..చిక్కుడు కొనాలంటే చిక్కొస్తోంది.. క్యాబేజీ కేక పెట్టిస్తోంది.. ఇలా ఏ కూరగాయ ధర చూసినా గుండె దడ పుడుతోంది. ఒక మాటలో చెప్పాలంటే రూ.500 ఖర్చు చేసినా సంచి అడుగు భాగం నిండడం లేదు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో సామాన్యుడికి కూర'గాయాలే' మిగులుతున్నాయి.



ధరణి వణికిపోతోంది!

కూరగాయలు	ప్రస్తుత ధరలు	పది రోజుల క్రితం ధరలు
	(కిలో రూపాయల్లో)	
ఎర్రగడ్డ	80	35
ఉల్లిగడ్డ	60	30
బెండకాయలు	50	30
బీన్స్	80	50
క్యారెట్	100	60
టమాట	60	30
వంకాయలు	80	35
ముల్లంగి	70	30
బీట్‌రూట్	75	35
బీరకాయలు	60	30
పచ్చిమిర్చి	80	30
కొత్తిమీర కట్ట	30	10

తినడం ఇష్టం.. కొనడం కష్టం

సామాన్యుడికి కూర'గాయాలే'

అమాంతం పెరిగిన ధరలు

ఏదైనా కిలో రూ.50 పైమాటే

తిరుపతి మంగళం : మొన్నటి వరకు ఉల్లిపాయలు కొనాలంటే కన్నీళ్లు వచ్చేవి. ఇప్పుడు కూరగాయల ధరలు మండుతున్నాయి. టమాట ధర చూస్తుంటే ఆకాశన్నంటుతోంది. రోజు రోజుకు ధర పెరిగిపోతోంది. నిత్యావసర సరుకులతోపాటు కూరగాయల ధరలు పోటీపడి పెరిగిపోతుండడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. సామాన్య, మధ్య తరగతి వారు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు వెళితే జేబుకు చిల్లుపడుతుందే కానీ సంచిలో నిండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కూరగాయల సాగును అధికారులు ప్రోత్సహిస్తే ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే అవసరం ఉండదనే అభిప్రాయం వెల్లడవుతోంది.

అన్నీ అందనంత దూరంలోనే..

తిరుపతి జిల్లాలోని కూరగాయల హోల్‌సేల్ మార్కెట్లకు ప్రస్తుతం 22నుంచి 24 వేల క్వింటాళ్ల కూరగాయలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే మూడు నుంచి నాలుగు వేల క్వింటాళ్ల దిగుమతి తగ్గింది. ఇక్కడి నుంచి కూరగాయలను చిల్లర వర్తకులు కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో విక్రయిస్తుండడంతో డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక ధరలను అమాంతం పెంచేశారు.

మాల్స్, సూపర్ మార్కెట్లతోపాటు ఆన్‌లైన్ షాపింగ్ యాప్స్‌లోనూ కూరగాయల ధరలు భారీగానే ఉన్నాయి. రైతు బజార్లలోని ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో 30నుంచి 50 శాతం వరకు ధరలు అధికంగా ఉన్నాయి. ఉల్లిపాయలు కిలో రూ.80, టమాట కిలో రూ.60, బెండకాయలు కిలో రూ. 50, బీన్స్ కిలో రూ. 80, క్యారెట్ కిలో రూ.100, పచ్చిమిర్చి కిలో రూ. 80, వంకాయ కిలో రూ. 80, ముల్లంగి కిలో రూ. 70, బీట్‌రూట్ కిలో రూ.75, బీరకాయ కిలో రూ.60, కొత్తిమీర కట్ట రూ.30 వరకు ధరలు పలుకుతున్నాయి.

తగ్గిన సాగు.. పెరిగిన ధరలు

వాతావరణ ప్రతికూల పరిస్థితులకు తోడు దేశవ్యాప్తంగా కూరగాయల సాగు తగ్గడంతో వేసవి ముగిసినా వంటింట్లో అగ్గి రాజుకుంటోంది. పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు గగ్గోలు పెడుతున్నాయి. సాధారణంగా వేసవిలో కాయగూరల ధరలు పెరిగే అవకాశం ఉండగా, ఈ సారి వేసవి ముగిసిన తర్వాత ధరలు ఒక్కసారిగా నింగినంటాయి. వంటింట్లో తప్పనిసరిగా వినియోగించే టమాట, ఆలు, ఉల్లి, వంకాయ, క్యారెట్, పచ్చిమిర్చి ధరలు ఈ వారం రోజుల్లోనే దాదాపుగా రెట్టింపయ్యాయి. బీర, కారకాయ, చిక్కుడు, దొండకాయ, సొరకాయ తదితర కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగాయి.

రికార్డు స్థాయిలో క్యారెట్

వర్షం ప్రభావంతో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. రవాణా వ్యవస్థ దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గిపోవడంతో పది రోజుల క్రితం వరకు రూ.40–50 పలికిన క్యారెట్ ప్రస్తుతం ఏకంగా రూ.100 ధర పలుకుతోంది. దాంతో పాటు మార్కెట్‌లో ఏ కూరగాయలు ఎత్తుకున్నా ధరలు భగ్గుమంటున్నాయి.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



ధరలు అమాంతం



మార్కెట్‌కు వచ్చే సరుకు తగ్గడంతో ధరలు అమాంతం పెరిగాయి. వర్షాల కారణంగా కూరగాయలు అవసరమైన మేరకు దిగుమతి కావడంలేదు. ధరలను చూసి మేమే కూరగాయలను విక్రయించడానికి సాహసించలేకపోతున్నాం. అధిక ధరలు పెట్టి కొనుగోలు చేసి సకాలంలో అమ్ముడుపోకపోతే తాము చాలా నష్టపోవాల్సి వస్తోంది. పెరిగిన ధరలను చూసి కొనుగోలుదారులు కూరగాయలను కిలోల లెక్కన కొనేవాళ్లు ఇప్పుడు పావు కిలో పైన కొనడం లేదు. – ముని బాలాజీ, కూరగాయల వ్యాపారి

ఇలాగైతే జీవనం కష్టమే



సంపాదించే డబ్బులో సగం కూరగాయలకే సరిపోతోంది. మార్కెట్లో కూరగాయల ధరల నుంచి పప్పులు వరకు బాగా పెరిగాయి. దీంతో ఇంటి ఖర్చులు రెట్టింపు అయ్యాయి. ఇంట్లో ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం పెరిగాయి. ప్రతినెలా ఆర్థిక భారం పెరుగుతోంది. రూ. 10నుంచి రూ.20 ఉండే కూరగాయల ధరలు రూ.70నుంచి రూ.80కు పెరిగాయి. ఇలా ధరలు పెరుగుతూ పోతే ఇల్లు ఎలా గడపాలి. ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించి, జిల్లాలో ఉత్పత్తిని పెంచాలి. – అనసూయ, గృహిణి

కళ్లెం వేయకపోతే ఇబ్బందే




ఇదివరకు ప్రతి నెలా రూ.3వేలు నుంచి రూ.4 వేల వరకు సరుకులకు ఖర్చుయ్యేది. ఇప్పుడు పెరిగిన పప్పులు, కూరగాయల ధరలతో రూ.6 వేలు వరకు ఖర్చు అవుతోంది. ఇలా ధరలు పెరిగితే ఇంటి బడ్జెట్ తారుమారు అవుతుంది. పప్పు దినుసుల నుంచి కూరగాయల ధరల వరకు అమాంతం పెరిగి పోయాయి. ధరలపై నియంత్రణ లేదు. ఎంతకు అమ్ముతున్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు. అన్న అంశంపై పర్యవేక్షణ లేదు. పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయకపోతే సామాన్యులకు ఇబ్బందే. – కె. చంద్ర, వినియోగదారుడు

ఉద్యోగుల ఆశలపై నీళ్లు

ఎన్నికలకు ముందు ఉద్యోగుల ఓట్ల కోసం కూటమి నేతలు అనేక హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమకు డీఏ, పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిలు అన్ని వెంటనే మంజూరు చేస్తారని ఉద్యోగులు ఆశించారు. అయితే అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా అతీగతీ లేదు. ఇంతవరకు తమకు కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందని ఆశించిన ఉద్యోగులు.. చివరికి ఏమీ చేయదనే భావనకు వచ్చారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని ఉద్యోగులు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

- రెండు జిల్లాల్లో బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు 55 వేల మంది
- రావాల్సిన బకాయిలు సుమారు రూ.3 వేల కోట్లు
- డీఏ, పీఆర్‌సీ, పీఎఫ్ కోసం ఐదు నెలలుగా ప్రదక్షిణలు
- బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.. కేబినెట్ మీట్‌లో చర్చ లేదని మండిపడుతున్న ఉద్యోగులు
- కూటమి సర్కారుపై లోలోన రగిలిపోతున్న వైనం



చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

చిత్తూరు జిల్లా టీచర్లు 8,728

తిరుపతి జిల్లా టీచర్లు 7,254

రెండు జిల్లాల్లోని ఇతర శాఖల ఉద్యోగులు 55 వేల మంది

పీఎఫ్ బకాయిలు రూ.1,500 కోట్లు వరకు

అన్ని రకాల బకాయిలు రూ.3 వేల కోట్లు వరకు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ఆనందం ఆవిరైపోయింది. ఆర్థిక ప్రయోజనాలు ఒక్కటీ నెరవేరడం లేదు. చంద్రబాబుకు ఓటేస్తే అన్ని అందుతాయని ఆశ పడిన వారికి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా చిల్లిగవ్వ రాల్చలేదు. దీంతో కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందా? అని ఉద్యోగులు డైలమాలో పడ్డారు.

పీఆర్‌సీ కమిషన్ ఊసేలేదు..

వాస్తవానికి 2023 జూలై నుంచి నూతన పీఆర్‌సీ కమిషన్ ఉద్యోగులకు వర్తించాల్సి ఉంది. గత ప్రభుత్వం వేసిన పీఆర్‌సీ కమిషన్‌కు గడువు ముగియడంతో పూర్తిగా రద్దయింది. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నూతన పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డీఏ, పీఆర్‌సీ, ఐఆర్ అన్ని ఇస్తారులే అని సంబరపడిన వారికి నిరాశే మిగులుతోంది. అయితే ఇంతవరకు అసలు పీఆర్‌సీ కమిషనే ఏర్పాటు చేయలేదని, ఐఆర్ ఊసే లేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

తప్పని ఎదురుచూపులు..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉద్యోగులకు అందాల్సిన పీఎఫ్ బకాయిలు కోట్లల్లోనే ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉద్యోగులు తమ జీతం నుంచి దాచుకున్న పీఎఫ్ నుంచి రుణాల కోసం దాచుకున్న వారి సంఖ్య రెండు జిల్లాల్లో దాదాపు 10 వేల మంది పైనే ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి వారి జీతాన్ని బట్టి దరఖాస్తు చేసుకున్న మొత్తం చూస్తే సరాసరి రూ.1,500 కోట్ల పైనే రావాల్సి ఉంటుందని అధికారిక అంచనా. వారితో పాటు ఉద్యోగ విరమణ చేసిన వారు మరో 800 మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరు గత ఐదు నెలలుగా పీఎఫ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రూ.3 వేల కోట్లకు పైనే బకాయిలు

చిత్తూరు జిల్లాలో 8,728 మంది, తిరుపతి జిల్లాలో 7,254 మంది మొత్తం రెండు జిల్లాల్లో 15,982 మంది టీచర్లు ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. వారితో పాటు ఇతర శాఖలకు చెందిన వారితో కలిపి మొత్తం రెండు జిల్లాల్లో 55 వేల మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. రాష్ట్రం మొత్తం మీద ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఆ ప్రకారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కనీసం రూ.3 వేల కోట్లు వరకు రావాల్సి ఉంది. ఈ 5 నెలల పాలనా కాలంలో కూటమి సర్కారు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.


పలుమార్లు సీఎఫ్ఎంఎస్ వైపు..

బకాయిలు ఎప్పుడు విడుదల అవుతాయా ? అని ఉద్యోగులు సీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్‌లో చూసుకుంటున్నారు. పోనీ పీఆర్‌సీ బకాయిలైనా వస్తాయా..? అంటే ఎప్పుడో రిటైర్డ్ అయినప్పుడు ఉద్యోగ విరమణతో కలిపి ఇస్తారంట అని యూనియన్ నాయకులు చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటుతున్నా ఇంతవరకు ఉద్యోగులకు చిల్లిగవ్వ విదిల్చింది లేదు. వచ్చే ఏడాది మార్చి వరకు ఎలాంటి బకాయిలు చెల్లించేది లేదని, ఇటీవల రహస్యంగా జీఓను కూడా విడుదల చేశారని ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు.

సరెండర్ లీవ్స్ సంగతి సరేసరి..


సరెండర్ సెలవుల బకాయిలు రావాల్సిన ఉద్యోగులు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సుమారు నాలుగు వేల మంది పైనే ఉన్నారు. వాటి ద్వారా రావాల్సిన బకాయిలు రూ.280 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఏపీ జీఎల్ఐ కాలపరిమితి పూర్తయి మెచ్యూరిటీ అయిన బకాయిలు రావాల్సిన ఉద్యోగులు మరో 500 మంది వరకు ఉన్నారు. వారికి మరో రూ.150 కోట్ల వరకు రావాల్సి ఉంది.

ఏ రకంగా చెల్లిస్తారో చెప్పాలి..




బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చింది. ఐదు నెలలు పూర్తవుతున్న నూతన ప్రభుత్వం ఇంత వరకు ఏ రకంగా బకాయిలు చెల్లిస్తారో చెప్పలేదు. క్యాబినెట్ సమావేశాల్లో చర్చలేదు. బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రెండు డీఏలు ప్రకటించాల్సి ఉంది. – బాలాజీ, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వెంటనే విడుదల చేయాలి..



ఉద్యోగులకు అందాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. బకాయిల చెల్లింపు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి వహించాలి. పీఆర్‌సీ కమిషన్‌ను వేసి నివేదిక వచ్చే లోపు ఐఆర్ 30 శాతం ప్రకటించాలి. గతంలో పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, పీఎఫ్ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. – జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సంక్రాంతికైనా ప్రకటించాలి..



దసరా, దీపావళికి డీఏ ప్రకటిస్తారని ఆశించాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. సంక్రాంతికైనా డీఏ ప్రకటించాలి. ఉద్యోగుల సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలి. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు, సమస్యలను మా రాష్ట్ర నేతలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. – శివయ్య, ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

రైల్వే అండర్ బ్రిడ్జి ఎప్పటికి పూర్తి చేస్తారు?

- పార్లమెంట్‌లో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంట్ పరిధిలోని నెల్లూరు జిల్లా వెంకటాచలం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వచ్చాయా? అలా అయితే అండర్ బ్రిడ్జిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బుధవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం సమీపంలో కిలోమీటరు 155/12–14 కిమీ వద్ద లెవెల్ క్రాసింగ్ 106కు బదులుగా రోడ్ అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు సంబంధించి విజయవాడ నుంచి గూడూరు స్టేషన్ వరకు మూడో లైన్ నిర్మాణం ప్రాజెక్ట్‌లో భాగంగా రోడ్ అండర్ బ్రిడ్జి మంజూరు అయ్యిందని కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే అదనంగా వెంకటాచలం యార్డు వద్ద లెవెల్ క్రాసింగ్ నంబర్ 107కు బదులుగా రూ.50 కోట్లతో రోడ్డు ఓవర్ బ్రిడ్జి కూడా మంజూరు చేశారని తెలిపారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లెవెల్ క్రాసింగ్ మూసివేయాల్సి ఉంటుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. అప్రోచ్ అలైన్‌మెంట్ ఫిక్సింగ్, డ్రాయింగ్ ఆమోదం, భూ సేకరణ, ఆక్రమణ తొలగింపు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంపై నిర్మాణ పనులు ప్రారంభించడం, పూర్తి చేయడం, ఆధారపడి ఉంటుందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి తెలిపారు. ఈ సమస్యను గతంలో పలుసార్లు ఎంపీ గురుమూర్తి కేంద్ర రైల్వే శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సముద్రం అల్లకల్లోలం

- తీరంలో ఈదురు గాలులు



తూపిలిపాళెం వద్ద అల్లకల్లోలంగా మారిన సముద్రం

వాకాడు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది బుధవారం రాత్రికి తుపానుగా మారనున్న క్రమంలో వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. తుపాను ప్రభావం జిల్లాలోని తీర ప్రాంతాలైన చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఎక్కువగా ఉంటుంది. సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో తీవ్రమైన చలితోపాటు, 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీయడంతోపాటు, తుంపర్లు పడతాయి. తీర వాసులు భయంతో గజగజవణుకుతున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ముందుస్తు తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో ఆయా మండల రెవెన్యూ అధికారులు తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని సముద్ర తీర ప్రాంత మండలాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సముద్రంపై వేటలో ఉన్న మత్స్యకారులు హుటాహుటిన ఒడ్డుకు చేరుకోవాలని జిల్లా మత్స్యశాఖ జేడీ నాగరాజ పిలుపునిచ్చారు. ఆ మేరకు మత్స్యకారులు వేటను మధ్యలో నిలిపి ఒడ్డుకు చేరుకున్నారు. బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త పరిచారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



సంఘటన స్థలంలో రమణయ్య మృతదేహం

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన ఇలక రమణయ్య(50) బుధవారం పొలంలో పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రమణయ్య తన పొలంలో వరినాట్లు వేయడానికి ట్రాక్టర్‌తో భూమిని సిద్ధం చేస్తున్నాడు. విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు వెళ్లే వైర్లు ట్రాక్టర్ పొగ గొట్టానికి తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలంలో పనులు చేస్తున్న రైతులు గుర్తించి విద్యుత్ సరఫరా నిలిపేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొక్కందలలో వ్యక్తి మృతి



సైదాపురం: మండలంలోని పొక్కందల గ్రామ సమీపంలోని సవకతోటలో గాదంశెట్టి కృష్ణయ్య (65) ఏళ్ల వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పొక్కందల గ్రామంలోని ఓ రైతు సవక తోటలో ఓ గుర్తు తెలియని 65 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో ఆ మృతదేహంపై కేవలం చొక్కా మాత్రమే ఉంది. కాగా 15 రోజుల క్రితం గ్రామానికి చెందిన గాదంశెట్టి కృష్ణయ్య(65) మతిస్థిమితం లేక కనిపించలేదంటూ అతని బంధువులు సైదాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మృతదేహం కృష్ణయ్యదేనని గ్రామస్తులతో పాటు బంధువులు గుర్తించారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) డిసెంబరు 8వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో ఉంచినట్లు తెలిపారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు యూ–డైస్ కోడ్ ద్వారా లాగిన్ అయి తమ పాఠశాలల విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని డీఈఓ కోరారు.

జనవరి 29న ఆరాధన మహోత్సవం

తిరుమల: ప్రముఖ వాగ్గేయకారుడు శ్రీ పురందరదాసుల ఆరాధన మహోత్సవాన్ని 2025 జనవరి 29వ తేదీన టీటీడీ నిర్వహించనుంది. సహస్ర దీపాలంకరణ సేవ అనంతరం మలయప్పస్వామి ఉభయ దేవేరులతో కలిసి సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనానికి విచ్చేస్తారు. సంగీత కళాకారుల బృందగానం ఆలకించిన అనంతరం స్వామివారు రాత్రి 8 గంటలకు బయలుదేరి 9 గంటలకు ఆలయానికి చేరుకుంటారు.

స్వర్ణమ్మకు తూట్లు..
ఇసుకింకరులకు నోట్లు



కేశవ రెడ్డి స్కూల్ వెనుక వైపు స్వర్ణముఖినదిలో పట్టపగలే ఇసుక తీస్తున్న హిటాచీ యంత్రం

అక్రమార్కులు స్వార్థం అనే గునపాన్ని స్వర్ణమ్మ గుండెల్లో దించుతున్నారు. కన్నీరింకిన స్వర్ణముఖి నదిలో ఇసుక యథేచ్ఛగా తోడేస్తున్నారు. నదిలో ఇసుకమేటలు మాయమై గోతులు కనిపిస్తున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారు. ఇందంతా రెవెన్యూ దృష్టికెళ్లినా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రకృతి సంపద కరిగిపోతోంది.

- సీఎం ఇలాఖాలో రెచ్చిపోతున్న ఇసుకింకరులు
- పట్టపగలే హిటాచీతో స్వర్ణముఖనదిలో తవ్వకాలు
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా తరలింపు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు
- సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామంటున్న రైతన్నలు


సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతల ధనదాహానికి అంతు లేకుండా పోతోంది. ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు నది పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు శూన్యం. సీఎం చంద్రబాబు నాయుడు సొంత మండలం చంద్రగిరిలో అధికార పార్టీ నేతల ఇసుక దోపిడీ తారాస్థాయికి చేరుకుంటోంది. ఏకంగా భారీ యంత్రాలతో స్వర్ణముఖి నదిని తోడేస్తూ, స్వర్ణమ్మకు తూట్లు పొడుస్తున్నారు.

సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తాం

స్వర్ణముఖి నదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేయడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఆయన ఆదేశాలను సైతం బేఖాతరు చేయకుండా ప్రకృతి సంపదను దోచుకుని, ఇతర ప్రాంతాలకు తరలించడంపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. గురువారం నారావారిపల్లెకు సీఎం రానున్న క్రమంలో ఇసుక తవ్వకాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆవేదన

స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారని నదీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను తలపించేలా ఇసుకను తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి, వ్యవసాయ బోర్లు దెబ్బతినే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాత్రింబవళ్లు అధికార పార్టీ నాయకులు ఇలా ఇతర జిల్లాలకు ఇసుకను రవాణా చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని మండిపడుతున్నారు.



నదిలో ఇసుకను తోడేయంతో చెరువును తలపిస్తున్న గోతులు

పట్టపగలే హిటాచీతో ఇసుక తవ్వకాలు

మండలంలోని బుచ్చినాయుడుపల్లె పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినదిలో గత కొద్ది రోజులుగా హిటాచీ యంత్రాలతో అధికార పార్టీకి చెందిన ఓ నేత ఇష్టారాజ్యంగా అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. గుట్ట గుట్టలుగా ఇసుకను పోగు చేసి, అక్కడ నుంచి పగలు ట్రాక్టర్లు, రాత్రి వేళల్లో టిప్పర్‌లతో ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. స్వర్ణముఖినదిలో సుమారు 15 అడుగుల లోతు వరకు హిటాచితో తవ్వకాలు జరపడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. స్వర్ణముఖినదిలో అక్రమ ఇసుక ఆపాలంటూ గతంలో నిరసనలకు దిగిన టీడీపీ నేతలు ఇప్పుడు వారే ఇంతటి అవినీతికి పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

గత రెండు రోజుల పాటు కేశవరెడ్డి స్కూల్ వెనుక వైపు భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమంగా హిటాచీతో ఇసుకను తోడేయడంతో ఘటన స్థలానికి వెళ్లిన వీఆర్వోలు అధికార పార్టీకి చెందిన ఆ నేతతో మంతనాలు జరిపి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల కంటి ముందే హిటాచీ ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని రైతులు మండిపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఆ నేత మండలంలోని పలు శాఖలకు చెందిన కొంత మంది అధికారులకు నెల నెలా ముడుపులు ముట్టజెప్పడంతోనే తామేమీ ఎరగనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయడంతోపాటు పరోక్షంగా సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలిద్దాం

- కలెక్టరేట్‌లో బాల్యవివాహాల నిర్మూలనపై సమావేశం
- హాజరైన వివిధశాఖల అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

తిరుపతి అర్బన్: సమష్టిగా పనిచేసి, బాల్య వివాహాల నిర్మూలిద్దామని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'బాల వివాహ్ ముక్త్ భారత్'కు మద్దతుగా తిరుపతి కలెక్టరేట్‌లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న 'బాల్య వివాహ రహిత భారతదేశం' కార్యక్రమానికి మద్దతుగా తిరుపతిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా అధికార యంత్రాంగం సహకరిస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు ఉపాధ్యాయులు, అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు శోభన్‌బాబు మాట్లాడుతూ 1920లోనే బ్రిటీషు ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలన చట్టం అమల్లోకి తెచ్చిందన్నారు. 2003 నుంచి రాష్ట్రంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నారన్నారు. అయినా బాల్య వివాహాలు కొన్ని తెగల్లో జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో బాల్య వివాహాలపై తాను ప్రత్యేకంగా పని చేశానని గుర్తు చేసుకున్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు డీఆర్ డీఏ తనవంతు సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ దేశంలో 23 శాతానికి పైగా బాల్య వివాహాలు ఇంకా జరుగుతుండడం బాధాకరమన్నారు. వీటికి మూల కారణం అన్వేషించాలన్నారు. పేదరికం, ఆర్థిక స్థితి, అవిద్య కారణంగా ఈ దురాచారం ఇంకా కొనసాగుతోందని అభిప్రాయ పడ్డారు. అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లాలో తడ, నాయుడుపేట, గూడూరు, ఎర్రావారిపాళెం మండలాల్లో బాల్య వివాహాల సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. గిరిజనుల్లో బాల్య వివాహాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిని నివారించడానికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అనేది ఒక మహత్తర కార్యం అన్నారు. బాలికలకు వివాహ వయసు 21కి పెంచాలని అభిప్రాయపడ్డారు. నోడల్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ బాల్య వివాహం సాంఘిక దురాచారమని, దీన్ని రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, విన్స్ సంస్థ డైరెక్టర్ మీరా, ఎస్ఎస్ఏ అధికారి శ్రీధర్, న్యాయవాది సుబ్రహ్మణ్యం, మహిళా పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మునిరాజా, ఐసీడీఎస్ అధికారులు, అంగన్ వాడీ కార్యకర్తలు, ప్రగతి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయవాడలో చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న ఫెడరేషన్ రాయలసీమ జోన్ చైర్మన్ కేవీ.చౌదరి

తిరుపతి కల్చరల్: వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలందరికీ బహుళ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు విజయవాడలో ఏపీ చాంబర్ బిజినెస్ ఎక్స్‌పో నిర్వస్తున్నట్లు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాయలసీమ జోన్ చైర్మన్ కేవీ చౌదరి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీల స్పాన్సర్లు ముందుకు రావడంతో మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోను రోజు వారీ సుమారు 20 వేల మంది సందర్శకులు సందర్శించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు సరైన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంతేకాక ఏపీటీడీసీ, ఎస్ఐడీబీఐ, నాబార్డ్‌తో పాటు వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాల వ్యాపారులు సందర్శకులకు ప్రభుత్వ కార్యక్రమాపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఎక్స్‌పోలో సదస్సులు, వివిధ రంగాలపై చర్చా వేదికలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రోజు వారి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి, అద్భుతమైన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఎక్స్‌పో ప్రారంభించి మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు రోజుల బిజినెస్ ఎక్స్‌పోను వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధులు మధుసూదన్‌రావు, రాజేంద్రన్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు

తిరుపతి క్రైమ్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసినట్లు తిరుపతి ఎక్సైజ్ సీఐ రామచంద్ర తెలిపారు. తిరుపతి పరిధిలోని వేర్వేరు కేసుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. వీరంతా గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి, యువతకు విక్రయించే వారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారాన్ని కూడా గోప్యంగా ఉంచుతామన్నారు.

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

- ఇద్దరు లైంగిక దాడి చేశారని తల్లిదండ్రుల ఫిర్యాదు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు (ఫైల్)

డక్కిలి: ఓ దివ్యాంగుడు నాలుగు రోజుల క్రితం గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అయితే అతడిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన డక్కిలి మండలం కందలవారిపల్లిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తులు కథనం మేరకు.. కందలవారిపల్లి గ్రామానికి చెందిన దవణం శంకరయ్య, పార్వతి దంపతుల కుమారుడు శ్రీను(20)కు మతిస్థిమితం లేదు. గత వారం రోజులు క్రితం అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శ్రీనుకి మాయ మాటలు చెప్పి గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితులు ఈనెల 22న డక్కిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శీను అనారోగ్యానికి గురయ్యాడని తెలిపారు. తరువాత రోజు శ్రీను తన ఇంటి మిద్దెపై నుంచి పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడికి అదేరోజు వెంకటగిరి పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన అనంతరం అక్కడ నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రుయా నుంచి ఈనెల 25వ తేదీన శ్రీనును సొంతూరు కందలవారిపల్లికి తీసుకొచ్చారు. మళ్లీ మంగళవారం శ్రీను అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందాడు. ఈమేరకు గూడూరు టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసులు, డక్కిలి ఎస్ఐ శివశంకర్ కందలవారిపల్లి గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలంలో విచారణ చేపట్టి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీను మృత దేహానికి శవపరీక్షలు నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శవ పరీక్షలు అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా లైంగిక దాడి జరిగిందా? లేదా అన్న విషయంపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసుల అధికారులు తెలిపారు.

సీఎం చంద్రబాబుకు సాదర స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట: చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియల్లో పాల్గొనడానికి బుధవారం సాయంత్రం 6.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో టీటీడీ ఈఓ శ్యామల రావు, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, భానుప్రకాష్, థామస్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి తదితరులు స్వాగతం పలికారు. సీఎంతో పాటు మంత్రి నారా లోకేష్ ఉన్నారు. అనంతరం ఆయన నారావారిపల్లెకు వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

-మరో ఇద్దరికి గాయాలు



మాధవ్ మృతదేహం

చిల్లకూరు: కడివేడు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన పల్లిపాటి మాధవ్(23) అనే యువకుడితో పాటు మరో ఇద్దరు యువకులు గూడూరులోని దుకాణాలు పనిచేస్తున్నారు. వారు బుధవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి బైక్‌లో బయలు దేరారు. కడివేడు పంచాయతీ రాజ్యలక్ష్మి గిరిజన కాలని సమీపంలోకి వచ్చేసరికే కోట వైపు నుంచి వస్తున్న లారీ గూడూరు నుంచి కోటకు వెళుతున్న కారును తిప్పంచే క్రమంలో బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురు యువకులు బైక్‌తోపాటు రోడ్డ పక్కకు పడిపోయారు. ఈ ప్రమాదంలో మాధవ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


వచ్చే నెలాఖరులోపు ఓటర్ల జాబితా




మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ వినయ్‌చంద్

తిరుపతి అర్బన్: డిసెంబర్ నెలాఖరు లోపు ప్రత్యేక ఓటర్ల జాబితా పూర్తి చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ వి. వినయ్ చంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే ఓటర్ల చేర్పులు, మార్పులు చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్‌తోపాటు ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, ఓటర్ల మృతులు, బదిలీలు తదితర అన్ని అంశాలను జాగ్రత్తగా తప్పులు లేకుండా ఈఆర్‌వోలు,ఏఈఆర్‌వోలు శ్రద్ధగా రూపొందించాలని ఆదేశించారు. 18–19 ఏళ్ల వయస్సు గల ఓటర్ల పై శ్రద్ధ చూపాలన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ – 2025 కు సంబంధించిన ప్రతి పనిని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత కుమార్, తిరుపతి జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, తిరుపతి డీఆర్వో నరసింహులు, చిత్తూరు డీఆర్వో మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పుత్తూరు: మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషయంగా ఉంది. డీఎంపురం గ్రామం నుంచి పుత్తూరుకు వస్తున్న ఆటో స్థానిక శాంతినగర్ వద్ద ఆవును తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తిమ్మాపురానికి చెందిన శంకర్(42) తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి విషయంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. నారాయణవనం మండలం బ్రాహ్మణతాంగేళి గ్రామానికి చెందిన నాగజ్యోతి(23), యశోద(43), మురగమ్మ (60), బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన గోవిందమ్మ(67), ప్రమీల(30) గాయపడ్డారు. అలాగే పరమేశ్వర మంగళం వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో డీఎంపురం గ్రామానికి చెందిన మనోహర్(45), రేఖ(36) గాయపడ్డారు. వీరందరూ పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏఎస్ఐ రవి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.